

నక్కలగూడలో సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# సమస్యల పరిష్కారానికి కృషి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

రెబ్బెన, జనవరి 29: నక్కలగూడ గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. రెబ్బెన మండలంలోని నక్కలగూడలో ఎమ్మెల్యే బుధవారం పర్యటించారు. ఆమెకు గ్రామస్తులు మంగళహారతులతో స్వాగతం పలికి పూలమాల, శాలువాలతో సన్మానించారు. అనంతరం గ్రామ సమీపంలో కొలువైన సమ్మక్క-సారలమ్మ దేవత గద్దెల వద్ద పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమ్మక్క-సారలమ్మ తల్లుల వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు దారి ఏర్పాటు కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, మాజీ ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, మాజీ వైస్ చైర్మన్ గజ్జల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు బొమ్మినేని అహల్యాదేవి, బుర్స పోశమల్లు, మహిళా మండలాధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, మాజీ ఉపసర్పంచ్‌లు బొమ్మినేని శ్రీధర్, కొడిపె వెంకటేశ్, మాజీ డైరెక్టర్ పల్లె రాజేశ్వర్‌రావు, మాజీ కో ఆప్షన్‌మెంబర్ జౌరొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు వినోద్‌జైస్వాల్, పందిర్ల మధునయ్య, పూలకండం దుర్గారావు, వరలక్ష్మి, తక్కలపల్లి రాజేశ్వర్‌రావు, జుమ్మిడి అనందరావు, దుర్గం భరద్వాజ్, దుర్గం తిరుపతి, ఉబెదుల్లా, రామడుగుల శంకర్, మడే చిన్నయ్య, మోడెం సర్వేశ్వర్‌గౌడ్, బొర్కుటే తిరుపతి, మోడెం తిరుపతిగౌడ్, రాపర్తి అశోక్, విలాస్, శ్రీకాంత్ తదితరులున్నారు.



పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

# పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే

నెన్నెల, జనవరి 29 : మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలోని కోణంపేట గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు కంకణాల తిరుపతి రెడ్డి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి కుటుంబానికి దుర్గం చిన్నయ్య, నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపి అనంతరం ఆయనతో ఉన్న అనుబంధం, గ్రామానికి, పార్టీకి చేసిన సేవలను కొనియాడారు.

# దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**అటవీ కార్యాలయం ఎదుట ధర్నా**



ధర్నా చేస్తున్న నాయకులతో మాట్లాడుతున్న సీఐ నరేందర్

జన్నారం, జనవరి 29 : చెక్‌పోస్ట్ వద్ద కారు డ్రైవర్‌పై దాడి చేసిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధితుడితో పాటు గ్రామస్తులు, నాయకులు బుధవారం జన్నారంలో ధర్నా చేశారు. తపాలాపూర్ అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద మంగవారం రాత్రి 11 గంటలకు జన్నారం నుంచి మంచిర్యాలకు కారులో వెళ్తుండగా అక్కడ అటవీశాఖ అధికారులు నిలిపివేశారు. కారును తనిఖీ చేస్తుండగా డ్రైవర్ మోబిన్‌పాషా ఫొటో తీస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది దాడి చేసి, ఫోన్‌ను లాక్కొని ఉదయం 4 గంటల వరకు కారును నిలిపివేశారు. ఈ విషయంపై మోబీన్‌పాషా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానిక నాయకులు, గ్రామస్తులతో కలిసి బస్టాండ్ సమీపంలో రాస్తారోకో చేశారు. ఎస్ఐ రాజవర్ధన్ అక్కడికి చేరుకొని నచ్చజెప్పడంతో అక్కడి నుంచి అటవీ శాఖ డివిజన్ కార్యాలయానికి వెళ్లి అక్కడ బైఠాయించారు. దాడి చేసిన వారిని సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. లక్షెట్టిపేట సీఐ నరేందర్ అక్కడికి వచ్చి మంచిర్యాల డీఎఫ్‌వోతో ఫోన్‌లో మాట్లాడించారు. దాడి చేసిన అటవీ అధికారులపై చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.




# పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- ముగియనున్న టి.జీవన్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి పదవీకాలం
- అమలులోకి వచ్చిన కోడ్.. కొత్త పథకాల అమలుపై నీలినీడలు

మంచిర్యాల, జనవరి 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ స్థానంతోపాటు మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ స్థానానికి, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఎన్నికల సంఘం ప్రకటనతో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఏక కాలంలో ఒకే సమయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం పట్టభద్రుల నియోజకవర్గం నుంచి టి.జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రఘోత్తంరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరు ఇరువురి పదవీకాలం మార్చి 29వ తేదీన ముగియనుంది. భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్‌ను అనుసరించి ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుంది. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలుకానున్నది. నామినేషన్లకు ఎనిమిది రోజుల సమయం ఇచ్చారు. ఫిబ్రవరి 10 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ కాగా, ఫిబ్రవరి 11న నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ ఉండనుంది. నామినేషన్ల గడువు ముగిశాక 12 రోజులపాటు ప్రచారం నిర్వహించుకోడానికి అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అనంతరం ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడిస్తారు. మార్చి 8 నాటికి ఎన్నికల కోడ్ ముగియడంతోపాటుగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ పూర్తికానున్నది. కాగా.. గతంతో పోలిస్తే పట్టభద్రుల ఓటర్ల సంఖ్య పెరిగింది. మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో 2.50 లక్షల మంది వరకు పట్టభద్రుల ఓటర్లు ఉండే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల మద్దతు కోసం పలు సంఘాల నాయకులు ప్రయత్నిస్తున్నారు. వివిధ విద్యా సంస్థల యజమానులు, వివిధ రంగాల్లో ప్రజలకు సేవలు అందించిన వారంతా పోటీలో నిలబడేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ మేరకు ప్రచారాలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో స్పీడ్ పెంచేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

### పథకాల అమలుపై నీలినీడలు

ఎమ్మెల్సీ షెడ్యూల్ విడుదలతో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలతోపాటుగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరగడానికి అవకాశం లేదు. దీంతో ఈనెల 26వ తేదీన ప్రారంభించిన ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల అమలుపైనా నీలినీడలు కమ్ముకున్నాయి. మార్చి 31వ తేదీ నాటికి రైతులందరికీ రైతు భరోసా ఇస్తామని ప్రకటించింది. కానీ.. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. దీంతో ఈ జిల్లాలో ఆ సమయానికి పథకం అమలును పూర్తి చేయడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల కోడ్ దృష్ట్యా మిగిలిన పథకాల అమలుకు ఎన్నికల సంఘం ఆమోదించే అవకాశాలు తక్కువే. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతుబంధు పథకాన్ని అమలు చేయడానికి వీల్లేదని ఎన్నికల సంఘం చెప్పింది. దీంతో ఇటీవల ప్రకటించిన పథకాల అమలు సాధ్యం అయ్యేలా లేదు. ఎమ్మెల్సీ ఎన్నికలు అయ్యాక స్థానిక సంస్థల ఎన్నికలు రావచ్చు. దీంతో ప్రభుత్వ పథకాల అమలు ఇప్పట్లో ఉండదనే ప్రచారం జరుగుతున్నది. ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలిసే ప్రభుత్వం పథకాలను మొదలు పెట్టిందని, ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా ఇవ్వలేకపోయామని సాకులు చెప్పి, ఆ తర్వాత చేతులు ఎత్తేసే అవకాశమే ఎక్కువ ఉందని రాజకీయ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

### ఉమ్మడి జిల్లాలో పట్టభద్రుల ఓటర్లు

| నియోజకవర్గం | ఓటర్లు |
|---|---|
| ఆదిలాబాద్ | 7,961 |
| బోథ్ | 4,576 |
| నిర్మల్ | 9,568 |
| ఖానాపూర్ | 5,412 |
| ముథోల్ | 4,835 |
| మంచిర్యాల | 16,542 |
| చెన్నూర్ | 7,308 |
| బెల్లంపల్లి | 5,144 |
| ఆసిఫాబాద్ | 2,739 |
| సిర్పూర్ | 3,653 |
| మొత్తం | 67,738 |

### ఉపాధ్యాయ ఓటర్లు

| జిల్లా | పురుషులు | స్త్రీలు |
|---|---|---|
| ఆసిఫాబాద్ | 314 | 143 |
| మంచిర్యాల | 940 | 610 |
| ఆదిలాబాద్ | 1073 | 488 |
| నిర్మల్ | 1263 | 681 |

### పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు

| జిల్లా | సెంటర్స్ |
|---|---|
| ఆదిలాబాద్ | 22 |
| నిర్మల్ | 32 |
| ఆసిఫాబాద్ | 18 |
| మంచిర్యాల | 38 |

### పోలింగ్ సమయం

(ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు)




# మున్సిపల్ కార్పొరేషన్‌గా మంచిర్యాల

- ఉత్తర్వులు వెలువరించిన డీఎంఏ కమిషనర్
- విలీన మున్సిపాలిటీ, గ్రామపంచాయతీల వివరాలు సేకరించాలని ఆదేశం
- ఫిబ్రవరి 6లోగా ప్రక్రియ పూర్తిచేయాలని నిర్ణయం

మంచిర్యాలటౌన్, జనవరి 29: మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ మున్సిపల్ శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 27 నుంచి మంచిర్యాల మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా మారుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కార్పొరేషన్‌లో విలీనం అవుతున్న నస్పూర్ మున్సిపాలిటీతో పాటు హాజీపూర్ మండలంలోని 8 గ్రామపంచాయతీల వివరాలన్నింటినీ సేకరించాలని మంచిర్యాల మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసేందుకు జనవరి మొదటి వారంలోనే గెజిట్ విడుదలైంది. తాజాగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. నస్పూర్ మున్సిపాలిటీ కమిషనర్‌తో పాటు విలీనమైన పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి గ్రామపంచాయతీల ఈవోలు, స్పెషలాఫీసర్ల నుంచి మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు తీసుకోవాలని జీవోలో పేర్కొన్నారు. దీంతో పాటు విలీన మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఉద్యోగుల వివరాలు, ఆస్తుల వివరాలు , ఇండ్లు, రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, లే అవుట్‌లు, ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ భవనాలు, ఫర్నీచర్, విద్యుత్ దీపాలు, తదితర వివరాలన్నింటినీ సేకరించాలని సూచించారు. మినిట్స్ బుక్‌లను సీజ్ చేయాలని, బ్యాంక్ ఖాతాలన్నింటినీ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పేరిట తెరవాలని, కార్యాలయాల బోర్డులపై మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అని రాయించాలని జీవోలో పేర్కొన్నారు. విలీన మున్సిపాలిటీతో పాటు 8 గ్రామపంచాయతీల అధికారులు మంచిర్యాల మున్సిపల్ కమిషనర్‌కు వివరాలు సేకరణకు సహకరించాలని సూచించారు. ఫిబ్రవరి ఆరో తేదీ నాటికి వీటి వివరాలకు సంబంధించిన ప్రక్రియను పూర్తిచేసిన ప్రభుత్వానికి రిపోర్టును అందించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత డివిజన్లు ఏర్పాటు ప్రక్రియను చేపట్టనున్నారు.






బస్టాండ్ స్థలంలో టేలా తొలగించాలని ధర్నా చేస్తున్న ఆర్కే 6 గుడిసెల వాసులు

# బస్టాండ్ స్థలంలో కాంగ్రెస్ నాయకుడి టేలా

**తొలగించాలని ఆర్కే 6 గుడిసెల వాసుల ధర్నా**

శ్రీరాంపూర్, జనవరి 29 : నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్ ఆర్కే 6 గుడిసెలు కొత్తరోడ్ వద్ద బస్టాండ్ కోసం కేటాయించిన స్థలాన్ని కాంగ్రెస్ నాయకుడు శంకర్ బుధవారం ఆక్రమించి టేలా ఏర్పాటు చేశాడని, దాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆర్కే 6 గుడిసెల వాసులు బుధవారం ధర్నా చేశారు. కాంగ్రెస్ నాయకులు బొడ్డు తిరుపతి, తోకల సురేశ్ పాటు బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ గుంట జగ్గయ్య, వార్డుల అధ్యక్షులు ఎండీ రఫీఖ్‌ఖాన్, ఎల్లయ్య ఆర్కే 6 గుడిసెల వాసులు మహిళలతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం బస్టాండ్ కోసం కేటాయించిన స్థలంలో మాజీ వార్డు సభ్యుడు శంకర్ రాత్రికి రాత్రి టేలా వేసి ఆ స్థలాన్ని ఆక్రమించాడని ఆరోపించారు. గతంలోనూ శంకర్ నిర్మించిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చి వేశారని తెలిపారు. వ్యాపార సముదాయం కోసం ఆక్రమణకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ సంతోష్ అక్కడికి చేరుకొని ఆక్రమణలుంటే మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆందోళనకారులకు సూచించారు. అనంతరం స్థలాన్ని కాపాడి, బస్టాండ్ నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ సతీశ్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు రామ్మూర్తి, సాగర్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలను ఎట్ల కూలుస్తరు?

**రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నాయకులు**



రెవెన్యూ అధికారులు, పోలీసులతో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నాయకుడు సూరిబాబు

బెల్లంపల్లి, డిసెంబర్ 29 : 'గవర్నమెంట్ మాది..అక్రమ నిర్మాణాలను ఎట్ల కూలుస్తరు ?' అంటూ అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు వచ్చిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులను మాజీ మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మత్తమారి సూరిబాబు, నాయకులు హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల సమీపంలో 170 పీపీ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చే పట్టారని ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు బుధవారం జేసీబీతో తహసీల్దార్ జ్యోత్స్న, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఆర్ఐ ఆదిలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పోలీసు బందోబస్తుతో వచ్చారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కడికి చేరుకొని కూల్చివేయొద్దని, 4 రోజుల సమయం ఇవ్వాలని అధికారులతో వాగ్వాదానికి దిగారు. జేసీబీతో అక్ర మ కట్టడాన్ని కూల్చకుండా అడ్డుకున్నారు. కాంగ్రెస్ నాయకులను వారించేందుకు పోలీసులు ప్రయత్నించగా వారిపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'గవర్నమెంట్ మాది..అధికారులను ఇక్కడి నుంచి బదిలీ చేయిస్తాం' అని బెదిరించారు. దీంతో బస్తీవాసులు అక్కడికి చేరుకొని ఈ స్థలంలో అంగన్‌వాడీ పాఠశాల, పోచమ్మ గుడి, వినాయకుడి షెడ్డు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఆక్రమించుకున్నారని కాంగ్రెస్ నాయకులతో వాగ్వాదానికి దిగారు. చివరికి తహసీల్దార్ జ్యోత్స్న ఆధ్వ ర్యంలో పోలీసు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని ఫిర్యాదు రావడంతో కూల్చివేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**నాగోబా జాతర సందర్భంగా**

# రేపు పాఠశాలలకు సెలవు

ఆసిఫాబాద్ టౌన్,జనవరి 29: ఈ నెల 31న నాగోబా జాతర సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31న ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలో జరుగనున్న నాగోబా జాతర సందర్భంగా జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. ఇందుకు బదులుగా మార్చి 8వ తేదీ 2వ శనివారం రోజు పాఠశాలలు కొనసాగుతాయని తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల దృష్ట్యా జూనియర్ కళాశాలలకు ఈ సెలవు వర్తించదని తెలిపారు.

### బయటపడ్డ సూర్య చంద్ర విగ్రహాలు

దండేపల్లి, జనవరి 29: దండేపల్లి మండలంలోని మేదరిపేట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ సమీపంలో పొలం దున్నుతుండగా సూర్యుడు, చంద్రుడి ప్రతిమలు చెక్కిన రాతి విగ్రహాలు బయటపడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు తండోపతండాలుగా తరలివచ్చి పూజలు చేశారు.ఒకే రాయిపై సూర్య, చంద్ర ప్రతిమలు చెక్కబడి ఉండడం విశేషమని గ్రామస్తులు అన్నారు.